క్లుప్తంగా

దివ్యాంగులకు దుప్పట్లు, గొడుగుల పంపిణీ


దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, తదితరులు

మాకవరపాలెం: దివ్యాంగులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల దివ్యాంగ విభాగం అధ్యక్షుడు దివ్వా భూషణం కుమార్తె జన్మదినం సందర్భంగా మంగళవారం మండలంలోని జీ నగరం గ్రామంలో 100 మంది దివ్యాంగులకు దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. వీటిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ నాయకులు రుత్తల వాసు, పెట్ల భద్రాచలం, బండారు గాంధీ, గంగరాజు, డీవీ ఎన్ రాజు, పక్కుర్తి సత్యనారాయణ, పంపాన రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వెదురు పొంతలు తొలగించాలని డీఎఫ్‌వోకు వినతి

నర్సీపట్నం : నర్సీపట్నం నుంచి తుని వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలోని పెడిమికొండ రిజర్వ్ ఫారెస్ట్‌లోని వెదురు పొంతలు రోడ్డుకు ఇరువైపులా వ్యాపించి ఉండడం తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని జనసేన నాయకులు అప్పన్న, ఎస్.ఎస్.జి.దొరబాబు, అద్దేపల్లి గణేష్ డీఎఫ్‌వో శామ్యూల్ దృష్టికి తీసుకువెళ్లారు. వెదురు పొంతలు మెయిన్‌రోడ్డుపై వ్యాపించి ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా వాటిని తొలగించే చర్యలు చేపట్టాలని డీఎఫ్‌వోను కోరారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని డీఎఫ్‌వో హామీ ఇచ్చినట్టు దొరబాబు తెలిపారు. డీఎఫ్‌వోను కలిసిన వారిలో మారిశెట్టి రాజా, బైన మురళి, త్రినాథ్ ఉన్నారు.

14 మంది విద్యార్థుల చేరిక


పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాకవరపాలెం: మండలంలోని సీతన్నఅగ్రహారంలో 14 మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో చేరారని ఎంఈవో మూర్తి తెలిపారు. ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేపట్టడంతో మంగళవారం ప్రైవేటు పాఠశాలల నుంచి 10 మంది, అంగన్‌వాడీ కేంద్రం నుంచి నలుగురు విద్యార్థులు చేరారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జూలై 12 వరకు ఇంటింటి సర్వే చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశామన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ వైద్యాధికారుల బదిలీ

నాతవరం : మండల కేంద్రం పీహెచ్‌సీలో పనిచేస్తు న్న ఇద్దరు వైద్యాధికారులు బదిలీపై వెళ్లిపోయారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అధికారులు బదిలీల్లో భాగంగా నాతవరం పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యాధికారి ప్రసన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి ఎం.రాజేష్‌నాయుడు వైజాగ్ కేజీహెచ్‌కు బదిలీ కావడంతో రిలీవ్ అయి వెళ్లిపోయారు. ఇక్కడకు అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి, మండలం సీలేరు ధారకొండ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యాధికారులను ఇక్కడకు నియమించారు. వారు ఇంకా అక్కడి నుంచి నాతవరం పీహెచ్‌సీకి రాలేదు. ఇంచార్జి బాధ్యతలు గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్‌కు అప్పగించారు. నాతవరం పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పని చేస్తున్న వెంకటరావును మన్యం జిల్లాకు బదిలీ చేశారు.

రాయితీ విత్తనాలు పంపిణీ

దేవరాపల్లి: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఖరీఫ్ వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గరిసింగి సర్పంచ్ గూడెపు రాము అన్నారు. ఈ మేరకు గరిసింగి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ స్వప్న, గూడెపు మోహన్, దువ్వార చిలుకు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అటవీశాఖ ఆర్థిక సహాయం

నర్సీపట్నం : ఆడవిపంది దాడిలో మరణించిన వ్యక్తి కుటుంబానికి స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు చేతుల మీదగా అటవీశాఖ ద్వారా ఆర్థిక సహాయం అందజేసారు. నాతవరం మండలం , శృంగవరం గ్రామానికి చెందిన మృతుడు నీలి నాగేశ్వరరావు 2024 నవంబరు 26న వరి పొలం కాపునకు వెళ్లాడు. అడవి పంది దాడితో నాగేశ్వరరావు మృతి చెందాడు. అటవీ శాఖ తరపున రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని స్పీకర్, డీఎఫ్‌వో ఎం.శామ్యూల్, రేంజర్ లక్ష్మీనర్సు బాధిత కుటుంబానికి అందజేశారు.

మార్కెట్‌యార్డ్‌లో పచ్చదనం పెంపు

రావికమతం: కొత్తకోట మార్కెట్ యార్డ్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు సర్పంచ్ లోవరాజు,వైస్ సర్పంచ్ పందల దేవా తెలిపారు. పంచాయతీ ఆధ్వర్యంలో భవిష్యత్తు అవసరం దృష్టిలో ఉంచుకొని పచ్చదనాన్ని పెంపొందించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 250కు పైగా కాము, వేప, బాదం,మామిడి,పనస,తదితర రకాలకు సంబంధించిన మొక్కలు నాటారు.

పెట్రోల్ బంకుల్లో జోరుగా ఆయిల్ కల్తీ!

- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- పట్టించుకోని తనిఖీ శాఖలు
- వాహనచోదకుల ఆగ్రహం



చోడవరం బంకులో పెట్రోల్ పోస్తున్న దృశ్యం

చోడవరం : వినియోగదారుల క్షేమాన్ని వదిలేసి, దోపిడీ భావంతో పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఆయిల్ కల్తీ చేస్తున్నారు. అసలే పెట్రోల్ ధరలు రోజురోజుకి కొండెక్కుతుంటే మరో పక్క పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కల్తీ యథేచ్ఛగా జరుగుతుంది. దీనివల్ల రూ.వేలు, లక్షలు పెట్టి కొనుగోలు చేసిన వాహనాలు మెకానిక్ షెడ్లకు చేరుతున్నాయి. ఇప్పుడు ఏ మెకానిక్ షెడ్లలో ఎక్కడ చూసినా ఇంజన్ మరమ్మతులకు గురైన బళ్లే ఎక్కువగా ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ బంకులు సుమారు చోడవరం పరిసరాల్లోనే 13 బంకులు ఉన్నాయి. నిఘా అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వీటిలో ఆయిల్ కల్తీ ఎక్కువగా జరుగుతుంది. పెట్రోల్, డీజిల్‌లో ఇథనాయిల్, ఇతర కెమికల్ ఆయిల్స్ కలిపి కల్తీకి పాల్పడుతున్నారు. ఆయిల్ కల్తీతోపాటు కొన్ని బంకుల్లో భూమిలో ఉంచిన స్టోరేజ్ ఆయిల్ ట్యాంకర్లు నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఇటీవల కురిసిన వర్షపునీరు పెట్రోల్, డీజిల్ ట్యాంకుల్లో చేరి ఆయిల్‌లో కలిసిపోతుండగా ఆ కల్తీ ఆయిల్‌నే వాహనాలకు వేస్తున్నారు. ఇటీవల చోడవరం పరిసరాల్లో పెట్రోల్ బంకుల్లో ఈ తరహా కల్తీతో అనేక వాహనాలు మరమ్మతులతో మూలకు చేరాయి. చోడవరం, వెంకన్నపాలెం, వడ్డాది, మాడుగుల, నర్సాపురం, సబ్బవరం ప్రాంతాల్లో బంకుల్లో ఆయిల్ కల్తీ మరీ ఘోరంగా జరుగుతోంది.

మొక్కుబడిగా తనిఖీలు...

బంకులను ఎప్పటికప్పుడు పరిశీలించి, తనిఖీలు చేయాల్సిన విజిలెన్స్, రెవిన్యూ, కొలతలు-తూనికలు, పౌరసరఫరాల శాఖాధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. ఇటీవల కాలంలో ఈ శాఖల తనిఖీలు మొక్కుబడిగానే ఉన్నాయి. తనిఖీలు లేకపోవడం వల్ల పెట్రోల్‌బంకుల యజమానులు ఇష్టారాజ్యంగా ఆయిల్ కల్తీకి పాల్పడుతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయిల్ కల్తీ వల్లే ఇంజన్లు పాడైపోతున్నాయని ధ్వజమెత్తుతున్నారు. మరమ్మతులతో వాహనాలు మార్గమధ్యలోనే నిలిచిపోవడం వల్ల దూరప్రాంతాలకు, అత్యవసర పనులపై వెళ్లే వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని బంకుల్లో కొలతల్లో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల పెట్రోల్ , డీజిల్ ధరలు లీటరు రూ.108కు పెరగడంతో ఆందోళన చెందుతున్న వాహనదాలకు ఆయిల్‌లో కల్తీ కారణంగా మరమ్మతులకు గురవుతున్న వాహనాలతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమౌతుంది. తక్షణం పెట్రోల్ బంకుల్లో ఆయిల్ కల్తీపై అధికారులు చర్యలు తీసుకోవాలని, కల్తీని అరికట్టాలని వాహదారులు కోరుతున్నారు.

కల్తీ ఆయిల్ వల్ల బండి ఇంజిన్ పాడైంది..

ఇటీవల బంకులో రూ.300 పెట్రోల్ కొట్టించాను. కొద్ది దూరం వెళ్లి బండి ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్ షెడ్‌కు తెచ్చాను. ఆయిల్ కల్తీ వల్లే ఇంజి న్ పట్టేసిందని తెలిసింది. పెట్రోల్ బంకుల్లో కల్తీని నివారించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మా వాహనాలు పాడవుతున్నా యి. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రామునాయుడు, వాహనచోదకుడు, దుడ్డుపాలెం

కార్యకర్తల్లో నూతనోత్తేజం కోసం మండల స్థాయి సమావేశాలు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అమర్‌నాథ్


మండల సమావేశం నిర్వహించనున్న చోడవరంలో కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న అమర్‌నాథ్

చోడవరం : పార్టీ కార్యకర్తల్లో నూతనుత్తేజం నింపేందుకు మండలాలు, గ్రామస్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని చోడవరం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఈనెల 29న చోడవరం మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని చోడవరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా సమావేశం నిర్వహించే సీతారామ కల్యాణమండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మండల స్థాయిలో జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని అమర్‌నాథ్ కోరారు. ఆయనతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్,మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్‌పల్లా నర్సింగరావు,, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పందిరి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు కందర్ప శంకర్, చిటికెల నాగేష్, మొల్లి సోమునాయుడు, బొడ్డు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

వచ్చే నెల 20న కేజేపురం మోదమాంబ జాతర



మోదమాంబ అమ్మవారు, ఉత్సవ కమిటీ చైర్మన్ జోగినాయుడు, సర్పంచ్ తదితరులు

- ఏకగ్రీవంగా ఉత్సవ కమిటీ ఎన్నిక
- ఉత్సవాలకు ఏర్పాట్లపై సమావేశం

మాడుగుల రూరల్: కె.జె.పురం ప్రజల ఆరాధ్య దైవం మోదమాంబ అమ్మవారి జాతర వచ్చే నెల 20వ తేదీన ఘనంగా నిర్వహించడానికి మంగళవారం ఉదయం కె.జె.పురం రామాలయంలో గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలతో పార్టీలకు అతీతంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమ్మవారి జాతర నిర్వహణ గురించి సమావేశంలో చర్చించారు. అందరి అమోదంతో నూతన ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా రాపేట జోగినాయుడుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్ జామి రమణబాబు, శాశ్వత కమిటీ అధ్యక్షుడుగా బోడ్డేడ సురేష్‌ను ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా రాపేట రాజశేఖర్‌నాయుడుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జోగినాయుడు మాట్లాడుతు వచ్చే నెల 20 వ తేదీన జరిగే జాతర విజయవంతానికి అందరూ సహకారం అందించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ జామి రమణబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కాళ్ల రాము,అప్పలనాయుడుతో పాటు కన్నబాబు, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ అమ్మతల్లి నాయుడు, స్థానిక నాయకులు శరగడం ఆదిబాబు, భీశెట్టి జగ్గప్పారావు, కర్రి నాగమణి, కర్రి సంతోష్‌కుమార్, రాపేట సత్యనారాయణ, ఆడారి గణేశ్, బాబ్జి, ఆడారి నారాయణరావు, బలరామ్, బోడ్డేడ సురేష్, ఆడారి వెంకట్రావు, రాపేట రాజశేఖర్‌నాయుడు, పరిమి కాసుల జగ్గారావు, ఆడారి శంకరావు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పకుండా చేయాలి


కె.కోటపాడులో వరి విత్తనాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : ఖరీఫ్‌లో వరిపంటను సాగు చేసే రైతులు తప్పకుండా విత్తనశుద్ధిని చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలో గొండుపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు సాగు సూచనలు చేశారు. రైతులు వరి విత్తనాలతో పాటు మోనోక్రోటోఫాస్ మందును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కిలో విత్తనాలకు 8 గ్రాముల మోనోక్రోటోపాస్ మందును పట్టించి విత్తనశుద్ధి జరపాలన్నారు. తద్వారా విత్తనం, భూమి ద్వారా వరి పంటకు తెగుళ్ళు సోకే పరిస్థితి ఉండదని, మంచి దిగుబడితో కూడిన పంట లభించనున్నట్లు సోమశేఖర్ తెలిపారు. గొండుపాలెం, కె.కోటపాడు రైతు సేవా కేంద్రాల వ్యవసాయశాఖ సహాయకులు సుధీర్, వరహాలుదొర పాల్గొన్నారు. కాగా మండలంలో 19 రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ సాగులో రైతులకు అందించేందుకు 1122 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులో ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఆర్జీఎల్ వరి విత్తనాలు 242 క్వింటాళ్లు ఉండగా బస్తా ధర రూ.990, సాంబామసూరి 157 క్వింటాళ్లు బస్తా ధర రూ.825, సోనామసూరి 101 క్వింటాళ్లు (రూ.960), శ్రీదృతి 445 క్వింటాళ్లు (రూ.960), ఇంద్ర 46 క్వింటాళ్లు (రూ.960), అమర 37 క్వింటాళ్లు (రూ.960), స్వర్ణ 44 క్వింటాళ్లు (రూ.960), మారిటేరు సాంబ 38 టన్నులు (రూ.960) ఉన్నాయని తెలిపారు.

హెచ్‌ఎం సొంత నగదుతో యూనిఫాం వితరణ

కె.కోటపాడు : గుల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూపు దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వీరాంజనేయులు తన సొంత నగదుతో కొనుగోలు చేసి అందించారు. పాఠశాలలో ప్రతి శుక్రవారం నిర్వహించే యోగా శిక్షణ సమయాల్లో విద్యార్థులు అంతా ధరించేందుకు వైట్ యూనిఫాంను వీరాంజనేయులు రూ.10వేలతో కొనుగోలు చేసారు. ఈ ఏకరూపు దుస్తులను సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ కశిరెడ్డి దేముడుబాబు, బండారు ప్రసాద్, రాళ్ళపల్లి శ్రీరామ్మూర్తి, తంగేటి శ్రీను సమక్షంలో మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. 1 నుండి 5 తరగతులు చదువులు సాగిస్తున్న పాఠశాలలో గల 25 మంది విద్యార్థులకు ఒక్కో జత ఏకరూపు దుస్తులను అందించినట్టు హెచ్‌ఎం తెలిపారు.

సమ్మెదలో జన్ జాతీయ గౌరవ వర్ష్ వేడుకలు

దేవరాపల్లి: గిరిజన గ్రామాల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రత్యేక దృష్టి సారించాలని చింతలపూడి సర్పంచ్ దొమ్మండి బోడెమ్మ కోరారు. చింతలపూడి పంచాయతీ శివారు సమ్మెదలో జన్ జాతీయ గౌరవ వర్ష్ వేడుకలను స్థానిక సర్పంచ్ దొమ్మండి బోడెమ్మ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పి. రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల పాత్రతో పాటు గిరిజన త్యాగాలను, సంస్కృతి, సంప్రదాయాలను దేశ ప్రజలకు తెలియజేసి గౌరవించడమే ఈ కార్యక్రమం ముఖయ ఉద్దేశ్యమన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ ద్వారా గిరిజన గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. డిజిటల్ అసిస్టెంట్ వరలక్ష్మి, ఫిషరీష్ అసిస్టెంట్ రజాక్ పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి


నిరసన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కారం చేయాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు రోజులుగా కొనసాగుతున్న కార్మికుల పోరాటానికి సీఐటీయు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక ఏళ్లుగా మున్సిపాలిటీలో మంచినీరు, విద్యుత్ తదితర పనులు చేస్తూ ఇంజినీరింగ్ కార్మికులు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత లేదు, సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడం లేదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, నాయకులు అప్పలనాయుడు, మురళీ, నాయుడు, నాగేంద్ర, దుర్గా శేఖర్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్

అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నామంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రకు సమ్మె నోటీసు అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మెలోకి వెళ్తున్నట్టు కార్మికులు సమ్మె నోటీసులో పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు ఆశావర్కర్లు సిద్ధం


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్లతో సీఐటీయూ నాయకుడు చిరంజీవి

రోలుగుంట : తమ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల దేశ వ్యాపితంగా చేపట్టనున్న సమ్మెకు సంబంధించి పోస్టర్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశావర్కర్లు విడుదల చేశారు. కనీస వేతనాలు చెల్లించాలని, కార్మికులకు లనుకూలంటా కార్మిక చట్టాలుండాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, డీజిల్ , పెట్రో ధరలు తగ్గించాలనే పలు వారి న్యాయ సమ్మతమైన డిమాండ్లను పోస్టర్‌లో పేర్కొన్నారు. వీరి సమ్మెకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నామని ఈ సందర్భంగా చిరంజీవి తెలిపారు.

తాగునీటి పథకాల క్లోరినేషన్

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు పంచాయతీ కార్యదర్శి బి.సురేష్‌బాబు తెలిపారు. పారిశుధ్య సిబ్బంది చేపడుతున్న పనులను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. పూడికపోయిన మదుముల ప్రాంతాల వద్ద పూడికను తొలగించే పనులను చేయించారు. గ్రామంలో తాగునీటి పథకాలను క్లోరినేషన్ చేపట్టి ప్రజలకు సురక్షితనీటిని అందించే చర్యలు తీసుకున్నామన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


తాటికొండ వెంకట అప్పారావు | రొంగలి గురు చరణ్ | జగదీశ్వరరావు


నవదీప్ | ఆడారి ఉషశ్రీ | పాలమరశెట్టి జయశ్రీ | సిరసపల్లి శరణ్య | మజ్జి రవి | షణ్ముఖ్


లిఖిత | జశ్వంత్ | యశశ్విని | లగుడు హర్షిత | గాలి కౌసల్య | అల్లక వర్షిణి | బి.సాత్ కుమార్ | మడగల ప్రణతి | ముచ్చకర్ల సృజన | పసుపులేటి గాయత్రి | ఎజ్జి ధనలక్ష్మి | సేనాపతి తనూజ్

నర్సీపట్నం : ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రూప తెలిపారు. బుచ్చియ్యపేటకు చెందిన తాటికొండ వెంకట అప్పారావు ఎంజేపీ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతిలో 584 మార్కులు తెచ్చుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఇదే పాఠశాల దాలివలస గ్రామానికి చెందిన రొంగలి గురుచరణ్ 576 మార్కులు సాధించి, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆయా విద్యార్థులను అభినందించారు.

మాకవరపాలెం: ట్రిపుల్ ఐటీకి మండలంలో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో చదివిన తామరం విద్యార్థి నూకల జగదీశ్వరరావు పది ఫలితాల్లో 585 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. అలాగే జీ కోడూరు ఉన్నత పాఠశాలలో చదివిన చెవ్వాకుల నవదీప్ 580 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని సాధించాడు. వీరిలో జగదీశ్వరరావుకు నూజివీడులోను, నవదీప్‌కు ఇడుపులపాయలోను ట్రిపుల్ ఐటీ సీట్లు పొందారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నారాయణరావు, జగదీష్ అభినందించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలు నుంచి ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన ఆడారి ఉషశ్రీ, పోలమరశెట్టి జయశ్రీ, లకు కడప జిల్లా ఇడుపాయల ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా, సిరసపల్లి శరణ్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని హెచ్‌ఎం ఓరుగంటి శ్రీనివాసరావు, పాఠశా ల కమిటీ చైర్మన్ సంతోష్‌కుమార్ అభినందించారు. గత ఏడాది ఈ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇదే గ్రామానికి చెందిన కశిపల్లి పవన్‌కుమార్ నాయుడు చోడవరంలో ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతూ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు.

కె.కోటపాడు : చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీలో సీట్లకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు జి.వి.రమణరాజు తెలిపారు. ఇటీవల పది పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థుల్లో ట్రిపుల్ ఐటీలో నలుగురు విద్యార్థులు సీట్లు పొందారు. వీరిలో ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీకి మజ్జి రవి, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి పాతరపల్లి షన్ముఖ్, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి దొడ్డి లిఖిత, సేనాపతి జశ్వంత్ ఎంపికయ్యారు. అలాగే కింతాడ కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన బి. యశశ్విని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యిందని ప్రిన్సిపాల్ చిన్నమ్మలు తెలిపారు. ఈ ఏడాది పది ఫలితాలలో యశశ్విని 577 మార్కులు సాధించింది.

రోలుగుంట : ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ తెలిపారు. వీరిలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి లగుడు వర్షిణి (ఇడుపలపాయ), గాలి కౌసల్య (శ్రీకాకుళం) ఆర్జీకెటీయూకి ఎంపికైనట్టు కేజీబీవీ ఎస్‌వో తులసి తెలిపారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అల్లక వర్షిణి (శ్రీకాకుళం), ఇదే పాఠశాల నుంచి స్పోర్ట్స్ కోటాలో బి.సాతుకుమార్(శ్రీకాకుళం) ఆర్జీకెటీయూ(రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం)కు ఎంపికై నట్టు ఎంఈవో జానుప్రసాద్ తెలిపారు.

రావికమతం: మండలం నుంచి ట్రిపుల్ ఐటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. రావికమతం జడ్పీ హైస్కూల్ నుంచి మడగల ప్రణతి, ముచ్చకర్ల సృజన, చినపాచిలి హైస్కూల్ నుంచి పసుపులేటి గాయిత్రి, మరుపాక ఏపీ ఆదర్శ పాఠశాల నుంచి ఎజ్జి ధనలక్ష్మి, సేనాపతి తనూజ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరంతా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించడం ద్వారా ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరందరికీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ బ్రాంచిలో సీట్లు కేటాయించారు. వారిని మరుపాక ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్, రావికమతం, చినపాచిలి హైస్కూళ్ల హెచ్‌ఎంలు శ్రీనివాస్, విజయశ్రీ, అభినందించారు.

బుచ్చెయ్యపేట : మండలంలో గల 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈవో బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. సీతయ్యపేట, రాజాం, వడ్డాది, విజయరామరాజుపేట హైస్కూలుకు చెందిన విద్యార్థులు త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. కొండపల్లి శ్రీలక్ష్మి, సింగిడి సాయి కుసుమ, జి.విజయజ్యోతి, కె.ధన్యశ్రీ, జె.ప్రవీణ్, రామ్‌చరణ్, కర్రి భవ్యశ్రీ, శంకర్‌లు త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు.

చోడవరం : స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు 11మంది ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నారు. గతేడాది ఆరుగురు ఎంపిక కాగా తాజాగా వచ్చిన త్రిబుల్ ఐటీ ఎంపిక జాబితాలో ఈ పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థినులు ఎ.వి.ఎన్.ఎస్ రమాగాయత్రి, చిరికి కీర్తి, షేక్ అనీరున్నీషా, కె.మౌనిక, పి.జెష్విని, వి.శ్రీలక్ష్మి, సిహెచ్ స్రవంతి, పి.అమృత, పి. ప్రహర్షిత, బి.నందిని, ఎస్.తేజశ్విని సీట్లు సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

వడ్డాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో గ్రామదేవత మోదకొండమ్మ పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భారీ మందుడుంగు సామాగ్రి కాల్చివేత, నేలడాన్స్‌లు,పలు అమ్మవార్ల వేషదారణలు, వేశాలు, అమ్మవారి ఘటాలతో భక్తులు అమ్మవారి ఆలయానికి చేరికుని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు యువకులు నేల డాన్స్‌లతో ఆకట్టుకున్నారు. పలువురు గ్రామ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడుగా ఫణి శాంతారామ్



గొలుగొండ : వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడుగా గుండుపాలెం కొత్తూరు గ్రామానికి చెందిన కొరుప్రోలు ఫణి శాంతారామ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టకు కృషి చేస్తూ క్రియాశీలకంగా పనిచేస్తున్న ఫణి శాంతారామ్‌కు పదవి దక్కడం పట్ల మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫణి శాంతారామ్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

పండ్ల తోటల పెంపకానికి 100 ఎకరాల భూసేకరణ లక్ష్యం

రోలుగుంట : పండ్ల తోటల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావు 100 ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించారని, ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు ఏపీవో పి.ఈశ్వర్రావు మంగళవారం తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో రైతుల నుంచి 56 ఎకరాలు సేకరించడం జరిగిందన్నారు. మిగిలిన భూమి సేకరణకు ఈ నెలాఖరు వరకూ గడువు ఉందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎకరాకు మూడేళ్ల పంట అభివృద్ధి కోసం ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.98 వేలు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కొబ్బరి, జీడి మామిడి, పామాయిల్ తదితర పండ్ల తోటల అభివృద్ధికి ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు.

బదిలీ అయిన వ్యాయామ ఉపాధ్యాయుడికి సత్కారం


చిట్టిప్రసాద్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం కుమారి

నాతవరం : చిత్తశుద్ధితో విధులు నిర్వహించే వారికి ప్రజల మన్ననలు ఉంటాయని డి.యర్రవరం హైస్కూల్ హెచ్‌ఎం ఆకుల కుమారి అన్నారు. డి.యర్రవరం హైస్కూల్లో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు కె.చిట్టిప్రసాద్ కోటపాడు మండలం ఎ.కోడూరు హైస్కూల్‌కు బదిలీ అయ్యా రు. ఆయనకు మంగళవారం హైస్కూల్ హెచ్‌ఎం కుమారి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు.

ఘనంగా చింతాలమ్మ తల్లి ఒడ్డు పండగ


చింతాలమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

దేవరాపల్లి : ముషిడిపల్లి గ్రామంలో చింతాలమ్మ అమ్మవారి ఒడ్డు పండగ మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక గ్రామ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళల కోలాటం, తీన్‌మార్ వాయిద్యాల నడుమ గ్రామస్తులు భారీ ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సర్పంచ్ మతల దేముడమ్మ, ఎంపీటీసీ బొడ్డు లక్ష్మి పాల్గొన్నారు.

నూతన వైద్యుల బాధ్యతల స్వీకారం

చోడవరం : చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ చిరికి దినేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటి వరకూ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ వినయ్ బదిలీపై తుని వెళ్లడంతో దినేష్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయన గత ఏడాదిగా ఇదే ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇదిలావుండగా ఈ ఆస్పత్రిలో ఖాళీగా గైనికాలజిస్టు పోస్టులో డాక్టర్ విష్ణుప్రియ బాధ్యతలు తీసుకున్నారు. ఈమె ఇప్పటి వరకూ అనకాపల్లి 100 పడకల ఆస్పత్రిలో పనిచేస్తూ ఇప్పుడు బదిలీపై ఇక్కడకు వచ్చారు.

దేవరాపల్లి : వేచలం పీహెచ్‌సీ వైద్యాధికార్లుగా సిహెచ్.శకుంతల, రమేష్‌బాబు స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శకుంతల వడ్డాది పీహెచ్‌సీ నుంచి రాగా, రమేష్‌బాబు పెదగంట్యాడ పీహెచ్‌సీ నుంచి వచ్చారు. ఇది వరకు ఇక్కడ వైద్యాధికారిగా పని చేసిన బి.హారిక విశాఖపట్నం ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లగా, మరో వైద్యాధికారి డా.గోవిందరెడ్డి పీజీ సీటు రావడంతో వెళ్లిపోయారు. తాజాగా ఇద్దరు వైద్యులను నియమించారు.